

సుజల స్రవంతి కాలువ నిర్మాణానికి
మట్టి నమూనాలు సేకరణ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో సుజల స్రవంతి కాలువ నిర్మాణానికి శుక్రవారం కెజిపూడి, పికెఆర్‌పురం రెవెన్యూ పరిధిలో అధికారులు యంత్రాలతో మట్టినమూనాలు సేకరించారు. ఇరిగేషన్ డిఇ, జెఇ, సూపర్‌వైజర్ ఆధ్వర్యాన ఈ పనులు చేపట్టారు. రైతులకు సమాచారం ఇవ్వకుండా మట్టి తవ్వకాలు చేపట్టడాన్ని సిపిఎం జిల్లా నాయకులు చల్లా జగన్ తప్పుబట్టారు. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని, సర్వే పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు.

మట్టి నమూనాలు సేకరిస్తున్న కార్మికులు

ప్రమాదకరంగా ఉన్న మలుపు

పాతిక రోజుల వ్యవధిలో.. అదే ప్రదేశం... వంతెన దిగే సమయంలో జరిగిన రెండు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందడంతో ఆ ప్రాంతమంటేనే వాహనచోదకులు బెంబేలెత్తి పోతున్నారు. పోలిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై లింగాలవలస బంకువద్ద జరిగిన వరుసన ప్రమాదాలతో వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఇక్కడ తరుచూ జరుగుతున్న ప్రమాదాలకు పోలిపల్లి వద్ద నిర్మించిన వంతెన దిగుతున్న సమయంలో ఉన్న చిన్న మలుపే కారణమని పలువురు అంటున్నారు. అంతేకాక ఒకవైపు రహదారి కొంచెం ఎత్తుగా ఉండడంతో పాటు జాతీయరహదారిలో కొంత డిజైన్ లోపం కూడా ఉందని సాక్షాత్తు అధికారులే అంటున్నారు.

మలుపే కారణం

- 25 రోజుల్లో 2 ఘోర ప్రమాదాలు
- ఆరుగురు మృత్యువాత
- బెంబేలెత్తిపోతున్న వాహనచోదకులు
- హైవే డిజైన్ లోపంపై అనుమానాలు

మలుపు వద్ద నవంబర్ 30న ప్రమాదానికి గురైన కారు (ఫైల్)

ప్రజాశక్తి- భోగాపురం

శ్రీకాకుళం నుంచి విశాఖ వెళ్లే జాతీయ రహదారిలో పోలిపల్లి వద్దనున్న లింగాలవలస బంకు అంటేనే వాహన చోదకులు ఉలిక్కిపడుతున్నారు. ఇటీవల కాలంలో జరిగిన రెండు ఘోర ప్రమాదాలే ఇందుకు కారణం. గత నెల 30న శ్రీకాకుళం పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రమాదాల పరంగా అత్యంత భద్రత కలిగిన ఫార్చునర్ కారులో డ్రైవరుతో సహ నలుగురు వ్యక్తులు విశాఖ వనిమిద వెళ్తూ వంతెనపై నుంచి ఒక్కసారిగా వేగంగా వచ్చి అవతలవైపు రహదారిలోకి దూసుకువెళ్లి లారీని ఢీకొట్టింది. దీనితో అందులో ఉన్న నలుగురు కూడా అక్కడికక్కడే మృతి చెందారు. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం కూడా ఇంచుమించు అలాంటిదే. కానీ డ్రైవర్ అవతల వైపు రహదారికి వెళ్లిపోకుండా వెళ్తున్న లారీని కుడివైపు బలంగా ఢీకొట్టింది. దీంతో కారు లోపల ఎడమ భాగాన కూర్చున్న భార్యభర్తలు ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు.

జాతీయ రహదారి డిజైన్ లోపమే కారణమా?

ఇటీవల లింగాలవలస పెట్రోల్ బంకు ఎదురుగానే వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. ఇక్కడ ప్రధానంగా వంతెనపై నుంచి దిగుతున్న సమయంలో పల్లం కావడంతో వేగం పెరిగి చిన్న మలుపు చూసి తిప్పే సమయానికి డ్రైవర్లు అదుపు చేయలేక ప్రమాదాల బారిన పడుతున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. దీనివలన ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

డిజైన్ లోపం పరిశీలించాలని హైవే ఇంజినీర్లను కోరాం

ఇటీవల ఇక్కడ జరిగిన ప్రమాదాలపై జాతీయ రహదారిపై ఏమైనా డిజైన్ లోపం ఉందేమో పరిశీలించాలని సంబంధిత హైవే ఇంజినీర్లను కోరాం. వంతెన దిగిన సమయంలో మితిమీరిన వేగంతో రావడం వలన వాహనాలు అదుపుతప్పి తున్నాయి. ఇటీవల జరిగిన రెండు ప్రమాదాల్లోనూ కారు సుమారు 100 నుంచి 140 స్పీడ్‌లో ప్రయాణిస్తున్నట్టు ఆయా ప్రమాదాలను బట్టి తెలుస్తోంది.

- ఎన్‌వి ప్రభాకర్, సిఐ, భోగాపురం సర్కిల్

రాజాంలో ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విద్యారంగ పరిరక్షణే లక్ష్యం

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు మోహనరావు, శ్రీలక్ష్మి ● జిల్లాకు చేరిన స్వర్ణోత్సవ సంబరాల ప్రచారయాత్ర

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకోవడం, రాజ్యాంగ విలువలు కాపాడుకోవడం లక్ష్యంగా యుటిఎఫ్ పనిచేస్తుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహనరావు, వి.శ్రీలక్ష్మి స్పష్టంచేశారు. కాకినాడలో జనవరి 5, 6, 7, 8వ తేదీల్లో జరిగే యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ సంబరాలను విజయవంతం చేయాలని చేపట్టిన ప్రచారయాత్ర శుక్రవారం విజయనగరం జిల్లాలోకి ప్రవేశించింది. శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభమైన ప్రచారయాత్ర రెండోరోజు విజయనగరం జిల్లాలోని రాజాంలోకి ప్రవేశించింది. అక్కడి నుంచి తెర్లాం, మెరకముడిదాం, గరివిడి, విజయనగరం మీదుగా శృంగవరపుకోటకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎక్కడికక్కడ జాతా బృందానికి యుటిఎఫ్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయా ప్రాంతాల్లో యుటిఎఫ్ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ క్రియాశీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఉపాధ్యాయులకు రీ గ్రూపింగ్ స్కేల్, అప్రెంటిస్ విధానం రద్దు, కౌన్సెలింగ్ విధానం, నెలవారి ప్రమోషన్లు, మెరుగైన పిఆర్‌సి, సకాలంలో డిఎ, తదితర డిమాండ్లపై యుటిఎఫ్ పోరాటం సాగించి, సాధించుకున్నట్టు వివరించారు. పాఠశాలల నిర్వహణలు, కేసులు, ఎన్నో అవరోధాలను అధిగమించి ఉపాధ్యాయులను పోరుబాట పట్టించిందన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడం, రాజ్యాంగ లక్ష్యాలు విలువలను కాపాడుకోవడం ప్రధాన కర్తవ్యంగా ఉండాలని చెప్పారు. అందుకోసం కాకినాడలో జరిగే రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలో భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తున్నట్టు వివరించారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెవిఆర్‌కె ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఎం.అప్పలనాయుడు, రాష్ట్ర నాయకులు డి.రాము, ఎ.సత్యశ్రీనివాస్, గొర్లె పద్మావతి, జెఆర్‌సి చట్టార్, జిల్లా కార్యదర్శులు పక్కి వాసు, సిహెచ్ తిరుపతినాయుడు, జి.వి.రమణ, ఎం.కృష్ణమూర్తి, ఎవి నాయుడు, నాయకులు కోరాడ రామలింగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

పంట నష్టంపై సమగ్ర పరిశీలన చేయాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారీ వర్షాలు కారణంగా నష్టపోయిన పంటలపై సమగ్ర పరిశీలన చేసి రైతులకు పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటిసారి తుపానుల వల్ల జిల్లా వ్యాప్తంగా వరి పంటకు కత్తెర తెగులు సోకి తీవ్రంగా నష్టపోయిందన్నారు. పంట చేతికొచ్చి కోతల కోసిన తరువాత మూడోసారి తుపాను వల్ల ఎక్కడికక్కడ వరి పంట నీటిలో మునిగిపోయి పూర్తిగా పాడైపోయిందని తెలిపారు. దీనికి తోడు మూలుగుతున్న నక్కపై తాటి పండు పడినట్లు అపరాలు పంటలైన మినుములు, పెసలు వేసిన రైతులు కూడా బాగా నష్టపోయారని ,ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని రకాలుగా దెబ్బ మీద దెబ్బ తగిలిన రైతులకు ప్రభుత్వం ఏ రకమైన సహాయమూ ప్రకటించలేదని అన్నారు. ఎన్నికల ముందు రైతుకు ప్రతిఏటా రూ.20వేల పెట్టుబడి సాయం చేస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ ఇవ్వలేదని ఆరోపించారు. నష్టపోయిన రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణతో వ్యవహరిస్తుందని అన్నారు. ఇప్పటికైనా పాలకులు, జిల్లా అధికారి యంత్రాంగం సమగ్రమైన పరిశీలన చేసి పంట నష్టాన్ని అంచనా వేయాలని, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనియెడల భవిష్యత్తులో రైతులతో కలిసి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, టివి రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

నిరవధిక సమ్మెలోకి పౌల్ట్రీ కార్మికులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

మండలంలో కర్లాం గ్రామ సమీపంలోని వెంకటరామ పౌల్ట్రీలో పని చేస్తున్న కార్మికులు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. ఈ సమ్మె శిబిరాన్ని సిఐటియు నాయకులు అంబళ్ల గౌరినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరి నాయుడు మాట్లాడుతూ వేతన ఒప్పందంపై యాజమాన్యం మొండివైఖరి వహిస్తోందని, నెలకు రూ.300 మాత్రమే పెంచుతానని చెప్పడం సరికాదని అన్నారు. రూ.2 వేలు పెంచాలని డిమాండ్‌చేశారు. వేతన ఒప్పందం చేసే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ, వెంకటరామ పౌల్ట్రీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గురినాయుడు, టి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు గౌరినాయుడు

విద్యుత్తు ఛార్జీల బాదుడుపై వైసిపి ఆగ్రహం

జిల్లా వ్యాప్తంగా నిరసన ర్యాలీలు ● విద్యుత్తుశాఖ అధికారులకు వినతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపి కూటమి ప్రభుత్వం ట్రూఅప్‌ఛార్జీల పేరిట పెంచిన విద్యుత్తు భారాలను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యాన నియోజకవర్గ కేంద్రాల్లో శుక్రవారం నిరసన ర్యాలీలు చేపట్టారు. విద్యుత్తుశాఖ అధికారులకు వినతులు అందజేశారు. ప్రజలపై భారాలు వేస్తే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. విజయనగరంలో విద్యుత్ ఛార్జీలకు నిరసనగా రింగ్ రోడ్డు లోని కాళికామాతా ఆలయం నుంచి దాసన్నపేట విద్యుత్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలు మీద భారాలు వేయడమే పనిగా పాలన సాగిస్తుందని అన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాట మీద నిలబడే మనిషి కాదని మరో సారి బయట పడిందన్నారు. రాష్ట్ర ప్రజలపై రూ.18వేల కోట్ల కు పైగా కరెంట్ ఛార్జీల భారం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని లేకుంటే రానున్న కాలంలో పెద్ద ఎత్తున ప్రజా పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నాలో మేయర్ విజయలక్ష్మి, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలి : విద్యుత్తు ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా స్థానిక వైసిపి కార్యాలయం నుంచి విద్యుత్తు శాఖ డివిజనల్ కార్యాలయం వరకు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఆధ్వర్యాన ర్యాలీ చేశారు. అనంతరం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం నుంచి ఆర్ఇసిఎస్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడున్న అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ తప్పుడు హామీలతో గద్దెనెక్కిన కూటమి కరెంటు ఛార్జీల పెంపుతో ప్రజలకు చుక్కలు చూపిస్తోందని విమర్శించారు. గృహ వినియోగదారులపై మోపిన రూ,15,485.36 కోట్ల బాదుడును వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు కెవి సూర్యనారాయణరాజు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, తాడ్డి వేణు, పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, వాకాడ శ్రీను, మాజీ జెడ్‌పిటిసిలు కోట్ల వెంకటరావు, మీసాల వరహాలనాయుడు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : స్థానిక మొయిద జంక్షన్‌లో వైసిపి ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. అనంతరం సబ్‌స్టేషన్ ఎఇకి మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, నాయకులు బడ్డుకొండ ప్రదీప్, చిక్కాల సాంబశివరావు, సారికి వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, దాట్ల సత్యనారాయణరాజు, రేగాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, వైసిపి నాయకులు, కార్యకర్తలు

రాజాం : పట్టణంలో అంబేద్కర్ జంక్షన్ నుంచి వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలే రాజేష్ ఆధ్వర్యాన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యుత్తు అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

భోగాపురం : వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యాన భోగాపురంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి విద్యుత్తు శాఖ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం డిఇ కుమార్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో వైసిపి పూసపాటిరేగ మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, నాయకులు ఉప్పాడ శివారెడ్డి, పడాల శ్రీనివాసరావు, రావాడ బాబు, కర్రోతు వెంకటరమణ, పతివాడ రామకృష్ణ, జనార్దనరావు, శ్రీనివాసరావు, మహంతి శ్రీనివాస్, అల్లాడ సత్యనారాయణ, ఎ.పైడినాయుడు పాల్గొన్నారు.

గజపతినగరం : విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో గజపతినగరంలోని వైసిపి కార్యాలయం నుంచి విద్యుత్తు సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం డిఇ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసిలు గార తవుడు, వర్రి నరసింహమూర్తి, రౌతు రాజేశ్వరి, ఎంపిపిలు బెల్లాన జ్ఞానదీపిక, సింహాద్రి అప్పలనాయుడు, పీరుబండి జైహింద్‌కుమార్, మాజీ ఎంపిపి కంది తిరుపతి నాయుడు, మాజీ జెడ్‌పిటిసి మంత్రి అప్పలనాయుడు, నాయకులు పాల్గొన్నారు.





గజపతినగరంలో ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, వైసిపి శ్రేణులు ; భోగాపురం, రాజాంలో ర్యాలీలు నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

కానిస్టేబుల్ అభ్యర్థులకు
30 నుంచి దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదేశాలతో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో సివిల్ (పురుషులు, మహిళలు), ఎపిఎస్‌పి పురుష కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 30 నుంచి జనవరి 22 వరకు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. విజయనగరం జిల్లాలో 9152మంది అభ్యర్థులకు పిఎంటి, పిఇటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వారిలో మహిళా అభ్యర్థులు 1584 మందికాగా, 7568మంది పురుష అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టిక్కెట్లతో తమకు కేటాయించిన తేదీన ఉదయం 4గంటలకు పోలీసు పరేడ్ గ్రౌండ్‌కు హాజరు కావాలని తెలిపారు. విద్యార్హతలు తెలిపే ఎస్ఎస్‌సి, ఇంటర్, కులం, నేటివిటీ, స్టడీ సర్టిఫికేట్స్ ఒరిజినల్స్ ను తీసుకు రావాలన్నారు. ప్రత్యేక కేటగిరిలో రిజర్వేషను పొందగోరే అభ్యర్థులు ఆయా రిజర్వేషన్లును దవీకరించే ఒరిజినల్ సర్టిఫికేట్స్ ను తీసుకురావాలన్నారు. వీటితోపాటు వెరిఫికేషను నిమిత్తం ఒక సెట్ గెజిటెడ్ అధికారితో అటెస్టేషను చేసిన జెరాక్స్‌కాపీలను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికేట్స్ తీసుకురాని అభ్యర్థులను తిరస్కరిస్తామని తెలిపారు. మహిళా కానిస్టేబులు ఉద్యోగాలకు పిఎంటి, పిఇటి పరీక్షలను జనవరి 3,4,6 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులకు నిర్వహించే శారీరక దారుఢ్య పరీక్షల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంతోపాటు, సిసి కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

దళారుల మాట నమ్మి మోసపోవద్దు

పోలీసు కానిస్టేబులు ఉద్యోగాల శారీరక దారుఢ్య పరీక్షను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎస్‌పి సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశలు కల్పించే దళారులు, మోసగాళ్ళ మాటలు నమ్మవద్దని, ఎవరైనా ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు వసూలు చేసినట్లయితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు దోహదం

ఎస్‌పి వకుల్ జిందాల్

కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు దోహదం చేస్తాయని ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. 2వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలో నేర నియంత్రణ, ప్రజల భద్రతకు ఏర్పాటు చేసిన సి.సి.కెమెరాలను, వాటిని నిరంతరం పర్యవేక్షించేందుకు పోలీసు స్టేషనులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు కోర్టు మానిటరింగ్ సిస్టంను 2వ పట్టణ పోలీసు స్టేషనులో ఎస్‌పి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి సిసి కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన దాతలను అభినందించి, జ్ఞాపికలు అందజేశారు. స్టేషన్ పరిధిలో ఇప్పటికే 620 సిసి కెమెరాలు ఏర్పాటు చేశారని, స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రజల సహకారంతో మరికొన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఒక సిసి కెమెరా 20మంది పోలీసులు చేసే పనిని చేస్తుందన్నారు. నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలపై నిరంతరం నిఘా పెట్టేందుకు, నేరాలను నియంత్రించుటలో సిసి కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. తొలిసారిగా ఒక పోలీసు స్టేషను పరిధిలో నిఘా ఏర్పాటు చేసేందుకు కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసి, ఇతర జిల్లాలకు సిఐ శ్రీనివాసరావు మార్గదర్శకంగా నిలిచారని ఎస్‌పి ప్రశంసించారు. టూటౌన్ సిఐ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని ప్రజలతో అనేకసారు మమేకమై, నేరాల నియంత్రణ, ప్రజలకు భద్రత కల్పించడంలో సి.సి.కెమెరాల ప్రాధాన్యతను వివరించడంతో ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే 15 రోజుల్లో మరో 60 సి.సి.కెమెరాలను 15 ప్రాంతాల్లో ఏర్పాటు చేసి, స్టేషనులోని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి, రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, 2వ పట్టణ ఎస్ఐలు మురళి, కృష్ణమూర్తి, ఎఎస్ఐ పైడితల్లి, పోలీసు సిబ్బంది, ఎంఎస్‌పిలు పాల్గొన్నారు.

1 నుంచి లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లను జనవరి 1వ తేదీ నుంచి సబ్ ట్రెజరీలు, జిల్లా ట్రెజరీలో స్వీకరిస్తామని జిల్లా ఖజానా అధికారి ఆర్.ఎ.ఎస్.కుమార్ తెలిపారు. ఆన్ లైన్ లో బయోమెట్రిక్ విధానం ద్వారా కూడా పెన్షనర్లు తమ సర్టిఫికెట్లు సమర్పించవచ్చన్నారు. జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా కూడా జీవన ధ్రువపత్రాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయడంలో అవసరమైన సహాయ సహకారాలు అందించడం కోసం ఒక హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించేందుకు అవకాశం వుందన్నారు.

వైసిపి ఆరోపణలు తగవు : జనసేన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విద్యుత్ ఛార్జీలు పెంచిన వైసిపి వారే నేడు ఛార్జీలు తగ్గించాలని ధర్నాలు చేయడం తగదని జనసేన నాయకులు గురాన అయ్యలు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదన జగన్ హయాంలోనే జరిగిందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ తాను పెంచిన చార్జీలపై తానే ధర్నాలకు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. 2019లో టిడిపి అధికారం కోల్పోయే నాటికి రాష్ట్రం మిగులు విద్యుత్ కలిగి ఉందని, జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రం అధోగతి పాలయ్యిందని ఆరోపించారు. ప్రజల సోమ్మును అప్పనంగా తన వారికి దోచిపెట్టేందుకు విద్యుత్ లోటును సష్టించారని విమర్శించారు.

పరిశుభ్రత పాటించాలి

డిపిఒ వెంకటేశ్వర్రావు

ప్రజాశక్తి-గుర్ల

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వర్రావు, తాహశీల్దార్ ఆదిలక్ష్మి కోరారు. వైద్యులు, గ్రామీణ నీటి సరఫరా, ఇతర అధికారులతో కలిసి గుర్ల మండలంలోని జమ్ము గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను, తాగునీటి పథకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిపిఒ వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ద్వారా చాలావరకు వ్యాధులను దూరంగా ఉంచవచ్చునని సూచించారు. వేడిగా, శుచిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అంటువ్యాధులు ప్రభలే సీజన్ కాబట్టి, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తినకుండా ఉండాలని కోరారు. గ్రామంలోని నీటిని పరీక్షించామని, సురక్షితమైనదని నిర్ధారణ అయ్యిందని తెలిపారు. కాలువల్లో చెత్త వేయకుండా, మురుగునీరు చుట్టు పక్కల నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న డిపిఒ వెంకటేశ్వర్రావు

సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. ఎస్.కోట మండలం దాంపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వచ్చిన వినతుల్లో అవకాశం ఉన్న వాటికి క్షేత్రస్థాయిలో పంచనామా నిర్వహించి, రికార్డులను పరిశీలించి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వినతులను తీసుకున్న వెంటనే, సంబంధిత రికార్డులను తనిఖీ చేసి, వీలైనంతవరకు అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. గ్రామంలోని ఇతర సమస్యలను కలెక్టర్ తెలుసుకున్నారు. నెలరోజులుగా బోరు పనిచేయకపోవడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శిపై చర్య తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ దీపాలు పనిచేయడం లేదని, విద్యుత్ స్తంభాన్ని మార్చాలని గ్రామస్తులు కోరారు. తక్షణమే గ్రామంలో పర్యటించి, సాయంత్రానికల్లా వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. శ్మశానానికి వెళ్లే మార్గంలో కల్వర్టును నిర్మించాలని గ్రామస్తులు కోరగా, ఉపాధిహామీ కింద గ్రామంలో తీర్మానం చేసి పంపిస్తే, మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పర్యటనలో ఆర్‌డిఒ డి.కీర్తి, తహశీల్దార్ అరుణకుమారి పాల్గొన్నారు.

శృంగవరపుకోట.. రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజల ఆస్తుల రక్షణే ధ్యేయం

ప్రజల ఆస్తుల రక్షణ ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. మండలంలోని వెంకటరమణపేట పంచాయతీ దాంపురం గ్రామంలో తహశీల్దార్ అరుణకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. శ్మశాన వాటిక కోసం బ్రిడ్జి రోడ్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, ప్రధాన కార్యదర్శి జుత్తాడ రామసత్యం, మాజీ ఎంపిటిసి కనిశెట్టి ఈశ్వరరావు, జనసేన నాయకులు వబ్బిన సన్యాసినాయుడు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని కృష్ణరాయుడుపేట, ఎజెపిపాలెం గ్రామాల్లో తహశీల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యాన శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. 11 దరఖాస్తులు అందినట్టు తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్ గంగాధర్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి : జెసి

జామి : రైతుల భూసమస్యలను వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అన్నారు. కుమరాంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జెసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల భూసమస్యలు తెలుసుకున్నారు. వాటిని ఎలా పరిష్కరించాలనే అంశంపై మండల స్థాయి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఐ.కృష్ణలత పాల్గొన్నారు.

మ్యూటేషన్ల అర్జీలే అధికం

రామభద్రపురం : రెవెన్యూ సదస్సుల్లో మ్యూటేషన్ల కోసం అధికంగా పిటిషన్లు వస్తున్నట్లు ఆర్‌డిఒ రామ్మోహనరావు తెలిపారు. మండలంలోని కొండకెంగువ గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఇప్పటి వరకు డివిజన్ పరిధిలో 1404 పిటిషన్లు రైతుల నుంచి వచ్చాయని ఆయన తెలిపారు. 74 అర్జీలను పరిష్కరించామని తెలిపారు. కొండకెంగువలో వన్‌బిలు రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల బ్యాంకు రుణాలు రెన్యువల్ చేయడానికి అవకాశం లేకపోతోందని మాజీ ఎంపిటిసి కంచుపల్లి రాము తెలిపారు. సమస్య పరిష్కరించాలని ఆర్‌డిఒ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సులోచనారాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరంకోట : రైతు సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల ప్రధాన ధ్యేయమని తహశీల్దార్ ఎన్. కూర్మనాధ రావు అన్నారు. శుక్రవారం పినవేమలి గ్రామంలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రెవెన్యూ రికార్డుల్లో తప్పులుంటే సరిచేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పినవేమలి, రాకోడు ఎంపిటిసి వేచలపు శ్రీనివాసరావు, ఎండోమెంట్ ఎఒ కె.పద్మావతి, మండల సర్వేయర్ అప్పలనాయుడు, విఆర్ఒ సత్యసంతోష్, టిడిపి నాయకులు కనకల రాంబాబు, సైలాడ గోవింద, పడాల సత్యనారాయణ, మాసాడ శ్రీనివాస్, మాసాడ నగేష్, రైతులు పాల్గొన్నారు.

విజయనగరంకోట.. అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-శృంగవరపు కోట

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం ఎంఇఒలు నర్సింగరావు, లక్ష్మికి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పారావు, ఎండిఎం కార్మిక సంఘం నాయకులు ఎర్ర దేవుడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం గోడౌన్‌లో తనిఖీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ శుక్రవారం తనిఖీ చేశారు. గోదాములకు, లోపలి జి-4,6 గదులకు వేసిన సీళ్లను తెరిపించి పరిశీలించారు. అనంతరం సీళ్లు వేయించారు. ఇవిఎం గోదాముల పక్కన ఉన్న కెజిబివి పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ డి.కీర్తి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కర్రావు, నెల్లిమర్ల తహశీల్దార్ సుదర్శన్, వివిధ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా లేఅవుట్

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఎస్‌కెఆర్‌పురం రెవెన్యూ పరిధిలో పంచాయతీ అనుమతి లేకుండా లేఅవుట్ ఏర్పాటు చేస్తున్నారు. భూములు కన్వర్షన్ అయినప్పటికీ పంచాయతీ పరంగా అనుమతులు తీసుకోలేదు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ ఆ లేఅవుట్‌లో రోడ్లు కూడా వేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా, లేఅవుట్ యజమానిని అనుమతులు ఉన్నాయని చెబుతున్నారు తప్ప ఆధారాలు చూపించడం లేదని చెప్పారు. తాను విధుల్లో చేరి రెండు నెలలైందని, ఇంతవరకూ ఆ లేఅవుట్‌కు అనుమతులు ఇవ్వలేదని వివరణ ఇచ్చారు.

అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన లేఅవుట్

'హలో పెన్షనర్' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ముద్రించిన హలో పెన్షనర్ పుస్తకాన్ని బొబ్బిలి కోటలో శుక్రవారం ఎమ్మెల్యే బేబినాయన ఆవిష్కరించారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై అవగాహన పెంచేందుకు పుస్తకం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ సంఘం నాయకులు డాక్టర్ జి.శశిభూషణ్ పాల్గొన్నారు.

జ్యూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్ల జ్యూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకువాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన జ్యూట్ చర్చల్లో లేబర్ కమిషనర్‌కి ఆయన వినతి పత్రం అందజేశారు. చర్చలకు జ్యూట్ యాజమాన్యం గైర్హాజరు కావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే ప్రభుత్వం, కార్మిక శాఖ అధికారులు స్పందించి జ్యూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని, మిల్లు తెరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొండల కరువులు, శ్రామిక సంఘం నాయకులు సముద్రపు సత్యనారాయణ, ఇఫ్టూ నాయకులు కాళ్ల అప్పలసూరి, మద్దిల అప్పలనాయుడు పాల్గొన్నారు.

బొబ్బిలి చరిత్ర ఉట్టిపడేలా కళారూపాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి చరిత్ర ఉట్టిపడేలా రైల్వే ఫ్లై ఓవర్‌పై కళారూపాలు వేస్తున్నట్లు కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు. పట్టణంలోని రైల్వే ఫ్లై ఓవర్, మల్లమ్మపేట అండర్ బ్రిడ్జి, మున్సిపల్ పార్కు, కోరాడవీధి ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఆర్‌ఒబిపై వేస్తున్న పెయింటింగ్స్‌ను పరిశీలించారు. బొబ్బిలి చరిత్ర కోసమే వీణ చిత్రాన్ని వేస్తున్నామని చెప్పారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేసిన వారిని గుర్తించి జరిమానా వేయాలని సిబ్బందిని ఆదేశించారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. శుక్రవారం ప్రత్యేకంగా పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించి సిబ్బంది సమస్యల పట్ల సానుకూలంగా స్పందించారు. ఒక్కొక్కరిని పోలీసు కార్యాలయంలోని తన చాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. వాటిని పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతామని తెలిపారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట, కరకవలస, వేపాడ, చినదుంగాడ పాఠశాలలను ఎంఇఒలు జగదీశ్వరరావు, పి.బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

అంగన్వాడీ పిల్లలకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడీ పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేసేందుకు అంగన్వాడీలకు ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి అందజేశారు. ప్రాజెక్టు పరిధిలో ఉన్న 212 అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న 1674 మంది పిల్లలకు పుస్తకాలు అందజేశారు. ఒకొక్క పిల్ల వాడికి ఐదు పుస్తకాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

అపరాల సాగులో సస్యరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని జక్కువ గ్రామంలో అపరాలు, మొక్కజొన్న సాగులో సస్యరక్షణపై శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి కె.గోవిందమ్మ రైతులకు అవగాహన కల్పించారు. పెసర, మినుములు, మొక్కజొన్న పంటల్లో ఎరువుల వినియోగం, చీడపీడల నివారణపై వివరించారు. కార్యక్రమంలో ఎఒ కె.గోకుల్‌కృష్ణ, గ్రామ ఉద్యాన సహాయకులు వర్రి రాము పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు దాలినాయుడుకు ఆహ్వానం

ప్రజాశక్తి-రామభద్రపురం

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, కవి కె.దాలినాయుడుకు ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం అందింది. శని, ఆదివారాల్లో విజయవాడలో జరిగే మహాసభలో ఆయన ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా దాలినాయుడుకు హెచ్‌ఎం కామేశ్వరరావు, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

వలసజీవులపై విధి కన్నెర్ర

- రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- కృష్ణా జిల్లా జుజ్జువరంలో ఘటన
- బాధితులు జక్కువ వాసులు

ప్రజాశక్తి- మెంటాడ

పొట్టకూటి కోసం వలసవెళ్లిన కుటుంబాలపై విధి కన్నెర్ర చేసింది. రోడ్డుప్రమాదం రూపంలో ఒకరిని కబళించింది. మరో ముగ్గురు వలసజీవుల్ని తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాల్జేసింది. మెంటాడ మండలంలోని జక్కువ గ్రామానికి చెందిన సుమారు పది కుటుంబాలు రెండేళ్ల క్రితం బతుకుతెరువు కోసం కృష్ణా జిల్లా జుజ్జువరం వెళ్లాయి. అక్కడే తాత్కాలిక నివాసం ఉంటూ అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చివెళ్తుంటారు. కొందరు భార్యాబిడ్డలతో వెళ్లగా, మరికొందరు పిల్లల్ని ఇక్కడే ఉంచి అక్కడ నుంచి బాగోగులు చూసుకుంటున్నారు. అలాంటి వారి జీవితాల్లో రోడ్డు ప్రమాదం అల్లకల్లోలం సృష్టించింది. శుక్రవారం అక్కడ జరిగిన రోడ్డుప్రమాదం చిన్నాభిన్నం చేసింది. కె.రాములు(55), రెడ్డి సత్యం, రెడ్డి ఈశ్వరరావు, కొత్తల సత్యం.. శుక్రవారం ఉదయం తమ ఇళ్ల నుంచి బయల్దేరి బహిర్భూమికి వెళ్తుండగా కూరగాయల లోడుతో వెళ్తున్న ఆటో బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మచిలీపట్నం ఆస్పత్రికి తరలించారు. రాములుకు భార్య కళావతి, పెళ్లీడుకొచ్చిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త రాములు మృతితో ఆయనతోపాటు వలసవెళ్లిన భార్య కళావతి కుప్పకూలిపోయింది. ఈ విషయం తెలిసి జక్కువలో ఉంటున్న కుమార్తెలిద్దరు గుండెలవిసేలా రోదిస్తున్నారు. రాములు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు స్థానికులు, బంధువులు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన ముగ్గురి కుటుంబాలు ఇక్కడ తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. ఈ ఘటనతో జక్కువలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రాములు(ఫైల్)

మృతుడి కుటుంబానికి రూ.20 లక్షలు ఇవ్వాలి

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వలస కార్మికుడు రాములు కుటుంబానికి రూ.20 లక్షలు పరిహారం ఇవ్వాలని సిపిఎం మెంటాడ మండల కన్వీనర్ రాకోటి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్ద మరణించడంతో ఆ కుటుంబానికి ఆసరా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి చేయూతనివ్వాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి-గజపతినగరం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి తెలిపారు. మండలంలోని మరుపల్లి హైస్కూల్, కెజిబివి, లోగిస, జిన్నాం, గజపతినగరంలోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఆమె సందర్శించారు. విద్యా రంగంపై సమగ్ర అవగాహన ఉన్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజయగౌరి కోరారు. జిఒ 117, సిపిఎస్ రద్దు వంటి దీర్ఘకాలిక అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు, జిల్లా కార్యదర్శి అల్లు శంకరరావు, మండల కోశాధికారి ఎ.రవికుమార్ పాల్గొన్నారు.

గజపతినగరం మోడల్ స్కూల్లో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

తప్పులతడకగా ఎస్‌సి జాబితా

ప్రజాశక్తి-వంగర

సచివాలయాల్లో ప్రదర్శించిన షెడ్యూల్డ్ కులాల జాబితా తప్పులతడకగా ఉందని దళిత బహుజన జెఎసి నాయకులు తలెఇపారు. శుక్రవారం మండలంలోని వంగర, శ్రీహరిపురం, నీలయ్యవలస, లక్ష్మింపేట తదితర గ్రామాల్లోని సచివాలయాల్లో ప్రదర్శించిన ఎస్‌సి జాబితాను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మజ్జి గణపతి మాట్లాడుతూ జాబితాలో కులం, ఉపకులం, ఇంటి పేర్లు లేవని చెప్పారు. ఇంటింటి సర్వే ద్వారా కులగణన చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై అభ్యంతరాలను విఆర్‌ఒ, తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు గంగులు, రామారావు, సింహాచలం, రాజు, అప్పలస్వామి, సుధీర్ పాల్గొన్నారు.

5న మాలల సింహగర్జన

ప్రజాశక్తి-సంతకవిటి

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా జనవరి ఐదో తేదిన విజయనగరంలో జరిగే మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత సంఘం నేత భవిరి శ్రీనుబాబు కోరారు. సంతకవిటిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితుల ఇంటింటికి వెళ్లి కులగణన చేయకుండా ఉప కులాలుగా వర్గీకరిస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణ పేరుతో రాజకీయంగా కుట్రచేసి దళితుల మధ్య చిచ్చు పెట్టడం సరికాదన్నారు. తక్షణమే ఉషా మెహ్రా కమిషన్ ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగ సవరణ ఒకటే మార్గమని స్పష్టంచేశారు. వర్గీకరణపై తక్షణమే సుప్రీంకోర్టు పునఃపరిశీలన చేయాలని కోరారు.

ఎక్సైజ్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరంలోని ఎక్సైజ్, ప్రొహిబిషన్ స్టేషన్‌ను జిల్లా ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును సమీక్షించారు. అనంతరం గజపతినగరం స్టేషన్ పరిధిలో వైన్ షాపుల లైసెన్స్‌దారులతో సమీక్షించారు. కార్యక్రమంలో సిఐ జె.జనార్దనరావు, ఎస్ఐ నరేంద్ర కుమార్, కొండలరావు పాల్గొన్నారు.

ఎస్ఐ గణేష్‌కి ప్రశంస

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్‌కి ప్రశంసా పత్రం లభించింది. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయించడంతో ఎస్‌పి వకుల్ జిందాల్ శుక్రవారం ఆయనకు ప్రశంసాపత్రం అందించారు.

మన్మోహన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి మాజీ ఎంపి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు సంతాపం తెలిపారు. దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని కొనియాడారు. దేశ ఆర్థిక స్థితిని, విదేశాంగ విధానాన్ని మలుపు తిప్పిన ఆయన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని పేర్కొన్నారు. తాను 13వ లోక్ సభ సభ్యునిగా ఉన్నప్పుడు ఆయన రాజ్యసభ సభ్యులని, పార్లమెంటు లైబ్రరీ అప్పుడు పై అంతస్తులో ఇరుగ్గా ఉండేదని, సభ్యులు కూడా అంత ఎక్కువగా వచ్చేవారు కాదని తెలిపారు. కానీ మన్మోహన్‌సింగ్, నేను రెగ్యులర్ విజిటర్లమని, మొదట పరిచయం చేసుకున్నానని తెలిపారు. తర్వాత ఎప్పుడు కనబడి విష్ చేసినా తిరిగి చిన్నగా నవ్వుతూ పలకరించేవారని, ఆయనకు ఎదురుగా కుర్చీలో కూర్చుని పుస్తకం పట్టుకుని అదే టేబుల్ షేర్ చేసుకోవడం ఇష్టపడేవాడినని డివిజి తెలిపారు. నీలిరంగు తలపాగాలోని తల ఎప్పుడూ పుస్తకాల్లో మునిగి ఉండడమే సజీవ జ్ఞాపకమని పేర్కొన్నారు.

మెంటాడ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు సిపిఎం ఆధ్వర్యాన నివాళులర్పించారు. మన్మోహన్ చిత్రపటానికి సిపిఎం మండల కన్వీనర్ రాకోటి రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిడగం చిన్నయ్య, కొత్త సింహాద్రి పాల్గొన్నారు.

బొబ్బిలి : బొబ్బిలి కోటలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఎమ్మెల్యే బేబినాయన నివాళులర్పించారు. దేశంలో ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు మన్మోహన్‌సింగ్ ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు రామమూర్తి, గెంబలి శ్రీనివాసరావు, జనసేన కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి బాబు పాలూరి పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, నాయకులు శంబంగి వేణుగోపాల్, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాం : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సంతాపం తెలిపారు. భారత రాజకీయ చరిత్రలో తనదైన ముద్ర వేసిన మన్మోహన్ సింగ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు.

ఒకటో తేదీ వరకు సంతాప దినాలు

విజయనగరం: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి సంతాప సూచకంగా కేంద్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి జనవరి 1వ తేదీ వరకు వారం రోజులు సంతాప దినాలుగా ప్రకటించిందని డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు తమ శాఖల పరిధిలో సంతాప దినాలను పాటించాలని పేర్కొన్నారు.

డిసిసిబి ఖాతాదారులకు ఉత్తమ సేవలందించాలి

ప్రజాశక్తి-విజయనగరం

ఉద్యోగుల పని సామర్థ్యాన్ని మెరుగుపరచి, వారిలో నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ఖాతాదారులకు మరింత ఉత్తమ సేవలందించాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పర్సన్ ఇన్ ఛార్జి, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ బోర్డు సభ్యులకు సూచించారు. డిసిసిబి బోర్డు 7వ సమావేశం పర్సన్ ఇన్ ఛార్జి సేతు మాధవన్ అధ్యక్షతన శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు సిబ్బందికి వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. సిబ్బందిలో జవాబుదారీ తనం పెంచే విధానాలను అమలు చేయాలన్నారు. ఆర్థికపరమైన సైబర్ నేరాలు అధికమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో బ్యాంకులో వివిధ విభాగాలు వాటికి లోనుకాకుండా పకడ్బందీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలన్నారు. కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ప్రస్తుత బ్యాంకు సిఇఒ సిహెచ్.ఉమామహేశ్వరరావు పదవీ కాలాన్ని మరో మూడేళ్లకు పొడిగిస్తూ పర్సన్ ఇన్ ఛార్జి ఆమోదం తెలిపారు. నాబార్డు డిడిఎం టి.నాగార్జున, జిల్లా సహకార అధికారి పి.రమేష్, ఆప్కాబ్ డిజిఎం షేక్ అఫ్సార్ జహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. కాలనీలో ఇళ్ల స్థలాలు ఆక్రమించి పునాదులు నిర్మించినట్లు ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులకు శుక్రవారం జేసీబీతో ఆక్రమణలను తొలగించారు. కాలనీలో ఆక్రమణలను గుర్తించి పూర్తి స్థాయిలో తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

క్షయను శాశ్వతంగా నిర్మూలించాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

క్షయ వ్యాధిని శాశ్వతంగా నిర్మూలించాలని టిబి జిల్లా ప్రత్యేకాధికారి వసుంధర అన్నారు. శుక్రవారం మండలంలోని కోనాడ గ్రామాన్ని ఆమె సందర్శించారు. టిబి 100 రోజుల అవగాహన కార్యక్రమాన్ని సందర్శించి, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం పూసపాటిరేగ పిహెచ్‌సిని సందర్శించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్ వర్మ, డాక్టర్ ప్రమీలదేవి, వైద్య సిబ్బంది మహేశ్వరి, ఉమాపతి, శ్రీనివాసరావు, జి.బంగారుబాబు పాల్గొన్నారు.

రేగిడి : క్షయ వ్యాధిపై చైతన్యం కావాలని డబ్ల్యుహెచ్‌ఒ కన్సల్టెంట్ డాక్టర్ డేని, బూరాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎస్.చలమయ్య, స్టేట్ టెక్నికల్ అధికారి వెంకట నాయుడు అన్నారు. శుక్రవారం వంద రోజుల్లో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా లింగాలవలసలో క్షయపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ రాధాకష్ణ, సూపర్‌వైజర్ సాయికృష్ణ, టిబి ట్రీట్మెంట్ సూపర్వైజర్ వేణుగోపాలరావు, సిహెచ్‌ఒ శిరీష, ఆరోగ్య కార్యకర్త రాణి పాల్గొన్నారు.

ఐటిఐలో శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వీ.టి అగ్రహారం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలోని నైపుణ్య కేంద్రంలో డొమెస్టిక్ ఐ.టి హెల్ప్ డెస్క్ కోర్సుకు మూడు నెలలు శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రినిపాల్ టివి గిరి తెలిపారు. 18 నుంచి 35ఏళ్లలోపు ఉండి, ఇంటర్, ఆపై చదువుకున్న వారంతా అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి వున్న అభ్యర్థులు విద్య అర్హత ధ్రువపత్రాలు, ఆధారు కార్డ్, 2 ఫోటోలతో ఐటిఐ కళాశాలకు తీసుకొని రావాలని కోరారు. రుతున్నాం. ఈ నెల30వ తేదీ లోపు అభ్యర్థులు https://forms.gle/vkUYDKj9DZyaHY2T%8 అనే లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 7780658035, 9849118075 నంబరుకు సంప్రదించాలని కోరారు.

సగం నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

టిడిపి జిల్లా అధ్యక్షుడికి జనసేన వినతి

ప్రజాశక్తి-డెంకాడ

నెల్లిమర్ల నియోజకవర్గంలో జనసేన పార్టీ బలంగా ఉందని, 50 శాతం నామినేటెడ్ పదవులు, పనులు కేటాయించాలని ఆ పార్టీ నాయకులు.. టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జునను కోరారు. శుక్రవారం విశాఖపట్నంలోని నాగార్జునను నియోజకవర్గంలోని జనసేన నాయకులు కలిశారు. సంక్రాంతికి ప్రభుత్వం నామినేటెడ్ పదవులు ప్రకటించనుందని, అందులో జనసేనకు సగం కేటాయించాలని కోరారు.

పన్నుల వసూళ్లపై సమీక్ష

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు, సిబ్బందితో కమిషనర్ రామలక్ష్మి సమీక్షించారు. ఇంటి పన్నులు, కొళాయి పన్నులతోపాటు ఖాళీ స్థల పన్నులు శతశాతం వసూలు చేయాలని ఆదేశించారు.

రామతీర్థం ఆలయానికి పాత్రలు వితరణ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో నిత్యన్నదానం కోసం దాతలు శుక్రవారం పాత్రలను వితరణ చేశారు. రామతీర్థానికి చెందిన కె.కిశోర్‌కుమార్, కిరణ్‌కుమార్ తమ తండ్రి, కీర్తిశేషులు ఖండవిల్లి రామకృష్ణమాచార్యులు పేరిట, విజయనగరానికి చెందిన విజయరామ జువెలరీ షాప్ యజమాని దాసరి శ్రీనివాస్ స్టీల్ ప్లేట్లు, గ్లాసులను సహాయ కమిషనర్ వై.శ్రీనివాస్‌కి అందజేశారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని కొత్తబగ్గాం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ జె.జనార్దనరావు తెలిపారు. పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-డెంకాడ

బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని మోదవలస సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కొండరాజుపేట గ్రామానికి చెందిన సరగడ సన్యాసి (59) సొంత పనిపై దాకమర్రి వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. ఇంతలో విశాఖ నుంచి విజయనగరం వైపు వెళ్తున్న బైక్ ఆయన్ను ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయాలై ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై ఉన్న ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. వీరు విశాఖ నుంచి రఘు ఇంజినీరింగ్ కళాశాలకు బైక్‌పై వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వీరిని తగరపువలస వద్దనున్న ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. డెంకాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

Government of Andhra Pradesh
APEWIDC., Vizianagaram Division

NIT No. EE/DB/ 5 /2024-25/ to 8/2024-25 dt. 27.12.2024.

Tenders invited from Registered Civil Contractors for NIT No. 5/ 2024-25 to 8/2024-25 dt. 27.12.2024 for 4 Works at APSWREI Society of Rs. 5.00 lakhs to 20.00 Lakhs.

Last date for receipt of Tenders 06.01.2024 up to 4.00 PM. Note:- for further details can be viewed at http// Tender "e"procurement.gov.in or Contact: 8008102811.

(D.V.N. Murthy)
Executive Engineer
APEWIDC., Vizianagaram.

IN THE HON'BLE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.P.13/2024

Between:
Vadapalli Venkata Ramana, and 3 others ...Petitioners
And:
Lenka Narayana and 58 & others ...**Respondents**

NOTICE TO RESPONDENTS 31, 50

R-31 :
Attada Ramunaidu, S/o Attada Krishna, aged 35 years, Hindu, residing at Kandhiveedhi, Gunkalam Village, Vizianagaram Mandal, Vizianagaram District.

R-50 :
Kandhi Appalanarayana, S/o Kandhi Appanna, aged about 65 years, Hindu, residing at PeddaVeedhi, Gunkalam Village, Vizianagaram Mandal, Vizianagaram District.

పై నెంబరు **I.P. 13/2024** లో పిటీషనర్లు ఇందలి రెస్పాండెంట్ల వద్ద నుండి ఋణములు తీసుకుని దరిమిలా దివాలా తీసినందున, అందుకు పిటీషనర్లు తమను ఇన్‌సాల్వెంట్ వ్యక్తులుగా ధృవీకరించమని కోరుచూ పై వ్యాజ్యము దాఖలు చేయగా సదరు వ్యాజ్యమును పై కోర్టు వారు 21.01.2025 తేదీకి వాయిదా వేసియున్నారు. కనుక పైన తెలిపిన రెస్పాండెంట్లు **R-31, R-50**కి ఏ విధమైన ఆక్షేపణలున్నా పై కోర్టు వారి ఎదుట **21.01.2025 తేదీన 10.30 ని॥లకు** హాజరై తమ ఆక్షేపణలు తెలియజేయవలసిందిగా, లేని యెడల వారి గైర్హాజరులో కేసును పై కోర్టు వారు తీర్పు ఇవ్వగలరని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

విజయనగరం
తే: 28.12.2024

శ్రీకె.ఎస్. సురేష్‌కుమార్,
శ్రీమతి వి.ఆర్. ఝాన్సీ
అడ్వకేట్స్, విశాఖపట్నం
మరియు కె.ఫల్గుణరావు,
అడ్వకేట్, విజయనగరం
సెల్ : 9966248215

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ గజపతినగరం జూనియర్ సివిలు జడ్జివారి కోర్టులో
IA 455/2024 in OS 63/2024

బిట్వీన్ :
అద్దేపల్లి అప్పలరాజు మరియు ఇతరులు ...వాదులు
మరియు:
జంపన తిరుపతిరాజు మరియు ఇతరులు ....ప్రతివాదులు

To
D1. జంపన తిరుపతిరాజు S/o లేటు భద్రరాజు, వయస్సు 65 సం॥లు, రామచంద్రపురం (గ్రామం), దత్తిరాజేరు (మం), విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాను, వాదులు షెడ్యూలు దాఖలా ఆస్థుల డిక్లరేషన్ మరియు స్వాధీనముకై ప్రతివాదులపై దావా వేసియున్నారు. కోర్టువారు మీకు పలుమార్లు సమన్లు పంపినప్పటికీ మీరు సదరు సమన్లు తప్పించుకొని తిరుగుచున్నందున శ్రీ కోర్టువారు పత్రికాముఖంగా మీకు సమన్లు జారీ చేసియున్నారు. సదరు ఆదేశముల ప్రకారము ఈ పత్రికాముఖంగా మీకు సమన్లు పంపించుట జరిగినది. కావున మీరు **తే 03-01-2025దీ**న సదరు దావా వాయిదాకు శ్రీ కోర్టువారి ఎదుట ప్రత్యక్షముగా **ఉదయం 10-30 గం॥**లకు హాజరగుట కాని, లాయరు గారి ద్వారా హాజరై మీ వాదనను దాఖలు చేయవలయును. లేని యెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షములో పై దావాలో తదుపరి ఉత్తర్వులు జారీ చేయుదురని యిందుమూలంగా తెలియజేయడమైనది.

//శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో//

బిత్రా సూర్యారావు
వాది తరపు న్యాయవాది
గజపతినగరం

మహారాజశ్రీ విజయనగరం ఎడిషనల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS 46/2023

బిట్వీన్ :
శ్రీ గాయత్రి చిట్స్ & ఫైనాన్స్ చీపురుపల్లి Rep by మేనేజింగ్ పార్టనర్ & ఫోర్‌మెన్ కె.వి.రమణరాజు ......ప్లెయింటిఫ్/వాది

And :
షణ్ముఖుని పద్మలత.....డిఫెండెంట్సు/ప్రతివాదులు

నోటీసు

To
D1) షణ్ముఖుని పద్మలత D/o గోపాలకృష్ణంరాజు, వయస్సు 53సం॥ R/of సత్యసాయి జ్యూయలర్స్, Opp H.P. పెట్రోల్ బంక్, చీపురుపల్లి విలేజ్ & మండలం, విజయనగరం డిస్ట్రిక్ట్.
D2) డా॥ కె.రమేష్, B.D.S తండ్రి పేరు తెలియదు, వయస్సు 56సం॥ డెంటల్ సర్జన్, C/o తిరుమల నర్సింగ్ హోమ్, Opp. S.V.N లేక్ హౌస్, విజయనగరం.
D4) చందక పైడిరాజు S/o మోహనరావు, వయస్సు 55సం॥, టీచరు, కర్లాం విలేజ్, చీపురుపల్లి మండలం, విజయనగరం డిస్ట్రిక్ట్.

పై నెంబరు దావాలో ప్రతివాదులు బకాయిపడిన సొమ్ము వసూలు నిమిత్తం దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా మీ హాజరు నిమిత్తం **తే 9-1-2025దీ**న కలదు. కనుక ఆ దినము **ఉదయం గం॥ 10-30ని॥**లకు స్వయంగా కాని లేక వకీలు ద్వారా కాని పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయవలయును. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఆర్డరు ప్రకారం)

ఇట్లు
బెల్లాన రవి
అడ్వకేటు, విజయనగరం